క్లుప్తంగా...

సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 2023–24 సంవత్సరానికి ఆంగ్ల విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ తెలిపారు. ఆంగ్ల విభాగంలో ఉన్న రెండు పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సిటీ కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడి మృతి


చంద్రకాంత్ (ఫైల్)

గోల్కొండ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రకాంత్ మృతి చెందారు. శుక్రవారం రాత్రి తన ఇంట్లో మెట్లపై ఆయన జారి పడ్డారు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం పురానాపూల్ హిందూ శ్మశానవాటికలో జరిగాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ చంద్రకాంత్ మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంజన్‌కుమార్ వెంట కాంగ్రెస్ నాయకులు రవీందర్, పురకుల కృష్ణ తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరా దేశ్'


ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కార్వాన్ శిశుమందిర్‌లో 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసుధన్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల అశోక్‌తో పాటు బీజేపీకి చెందిన వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్‌లో పలు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాదీముబారక్ పథకం నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు కల్పతరువు లాంటిదన్నారు. దరఖాస్తుతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలు జతచేస్తే కానీ చెక్కులు మంజూరు కావాని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూస్‌ఫరాన్ తదితరులున్నారు.

కుల్సుంపురాలో స్వచ్ఛ్‌భారత్


కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్‌లో రోడ్డుపైన ముళ్ల కంపను తొలగిస్తున్న దృశ్యం

జియాగూడ: గోల్కొండ జిల్లా స్వచ్ఛ్‌భారత్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు గోల్కొండ జిల్లా స్వచ్ఛ్‌భారత్ సెల్ కో కన్వీనర్ పైలం సందీప్ సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంజి రఘునాథ్, సోషల్ సర్వీస్ సభ్యుడు ఆధలా కార్తీక్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ కుల్సుంపురా పోలీస్ కాలనీలో రోడ్డు ఇరువైపులా ఉన్న తుమ్మచెట్లు, ముళ్ల కంపను తొలగించారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు నిర్వహించినట్లు తెలిపారు.

మహా ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

గచ్చిబౌలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మహాధర్నాకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం మసీద్‌బండ నుంచి బీజేపీ కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌కు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘవేంద్రరావు, రాధా కృష్ణ యాదవ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, మధు యాదవ్, గణేష్, భరత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న డీసీపీ



ప్రతిభ చూపిన పోలీసులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న డీసీపీ

రాజేంద్రనగర్: అత్యవసరంగా ఫోన్ చేయాలని అడిగి మెడలోని బంగారు గొలుసును తెంచుకొని ఉడాయించిన ఇద్దరు అన్నదమ్ములను నార్సింగి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇద్దరు పాత నేరస్తులు కాగా ఒకరు గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పుప్పాలగూడ అల్కాపూరి టౌన్‌షిప్‌కు చెందిన యోగేంద్ర(31) తన భార్య, మరోవ్యక్తితో కలిసి అనంతపూర్‌లోని గ్రామానికి వెళ్లి ఈ నెల 7వతేదీన తెల్లవారుజామున 5 గంటలకు పుప్పాలగూడ ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద బస్సు దిగారు. టోల్‌గేట్ నుంచి ముగ్గురు బస్సు దిగి సర్వీస్ రోడ్డువద్దకు వచ్చి ఆటో బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో గోల్కొండ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సయ్యద్ నవాజ్(22) అతడి సోదరుడు సయ్యద్ షరీఫ్(23) ద్విచక్ర వాహనంపై వచ్చి యోగేంద్రను అత్యవసరం ఫోన్ చేసుకోవాలని తమ వద్ద ఫోన్ లేదని తెలిపారు. నిజమని నమ్మిన యోగేంద్ర తన చేతిలో ఉన్న లగేజీ బ్యాగులను కిందపెట్టేందుకు ప్రయత్నిస్తుండగా సయ్యద్ నవాజ్ యోగేంద్ర మెడలోని గోలుసును తెంపి పరిగెత్తేందుకు ప్రయత్నించాడు.అప్రమత్తమైన యోగేంద్ర చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో చైన్ తెగి తులంన్నర చైన్ నిందితుడిచేతిలోకి వెళ్లగా మరో చైన్‌ముక్క యోగేంద్ర చేతిలోకి వెళ్లింది. యోగేంద్రతోపాటు అతడివెంట ఉన్నవారు ప్రతిఘటించేందుకు ప్రయత్నించగా చాకుతో బెదిరించారు. నిందితులు ఇద్దరు ద్విచక్రవాహనంపై పారిపోయారు. అంతకు ముందే రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్నదమ్ముళ్లు ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్న వ్యక్తినుంచి ఫోన్ లాక్కొని పారిపోయారు. ఈ రెండు సంఘటనలు గంటలోపే పూర్తిచేసి ఇంటికి చేరుకున్నారు. యోగేంద్ర చైన్ స్నాచింగ్ విషయమై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏసీపీ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, నిందితుల పోలికలకు అనుగుణంగా శనివారం ఉదయం సయ్యద్ నవాజ్, సయ్యద్ షరీఫ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా చైన్‌స్నాచింగ్‌తో పాటు దొంగతనం విషయాలు తెలిపారు. నిందితుల వద్ద నుంచి బంగారు చైన్‌తో పాటు సెల్‌ఫోన్ ఒక కత్తి,దొంగతనానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకోని నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసులో ప్రతిభ చూపిన పోలీసులకు డీసీపీ నగదు పురస్కారాలు అందజేశారు. నిందితులిద్దరిపై పీడీ యాక్ట్ పెట్టేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మినారాయణ, నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మొక్కలు నాటిన విద్యార్థులు

మణికొండ: గండిపేట్‌లోని ఎంజీఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మేరా మాటి..మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, రవిచందర్, డాక్టర్ ఎస్.రామకృష్ణ తదితరులున్నారు.

మొక్కలు పంపిణీ చేసిన కార్పొరేటర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వార్డు ఇన్‌చార్జి సుకుర్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆస్పత్రి రిసెప్షనిస్ట్ అదృశ్యం

శంషాబాద్ రూరల్ : ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్న మహిళ అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన మేరకు.. మండలంలోని మదన్‌పల్లికి చెందిన కుమ్మరి సంతోష్ భార్య అఖిల (24) శంషాబాద్‌లోని న్యూ ఆపిల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. ఈ నెల 11న ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి ఆటోలో డ్యూటీకి వెళ్లింది. కాని ఆమె ఆస్పత్రికి వెళ్లలేదు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె భర్త శనివారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు సోషల్ మీడియా ద్వారా పరిచమై గతంలో అతని వెంట ఈమె వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి


విద్యార్థులకు డ్రెస్ పంపిణీ చేస్తున్న స్వామిగౌడ్

బండ్లగూడ: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ వెల్లడించారు. నిరుడు విఠలయ్య 7వ వర్ధంతి సందర్భంగా కిస్మత్‌పూర్‌మాజీ ఉప సర్పంచ్ శేఖర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు డ్రెస్, షూస్‌పంపిణీతో పాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రాంతాలకు చెందిన 45 మంది యువకులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, లంకల నిఖిలసంగారెడ్డి, భూపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఐక్యత, కర్తవ్య భావన పెంపొందాలని ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న రవికుమార్‌యాదవ్, రఘువేంద్రరావు తదితరులు

గచ్చిబౌలి: ఆజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మసీద్‌బండలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి అమృత కాల పంచ ప్రాణాల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారత దేశమే లక్ష్యంగా ప్రతి అంశంలో బానిసత్వం నుంచి విముక్తి పొందాలని ఆకాంక్షించారు. ప్రజల్లో కర్తవ్య భావన పెంపొందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రఘువేంద్రరావు, రాధా కృష్ణ యాదవ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, మధు యాదవ్, గణేష్, భరత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పాత్ర కీలకం


నేతాజీనగర్‌లో జోడోయాత్రలో పాల్గొన్న రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర మరువ లేనిదని, కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతోనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మోహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్‌లో హత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రెండవ రోజు ఆయనకు స్థానికులు హారతుల పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఇచ్చిన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం కల్పించాలన్నారు. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని లాల్‌దర్వాజా జగదీష్ మందిర్ ప్రాంగణంలో శనివారం ఆమె రూ.5.30 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు స్థానంలో జీహెచ్ఎంసీ ద్వారా మంజూరైన రూ.5.30 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్ ముదిరాజ్, నాయకులు అర్జున్ ఆర్య, జమాల్‌పూర్ అశోక్, స్వప్న, బలరాం, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఫెమినా మిస్ ఇండియా'ల సందడి

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని క్రీమ్‌స్టోన్ ఐస్‌క్రీమ్స్ స్టోర్‌లో ఫెమినా మిస్ ఇండియాలు సందడి చేశారు. శనివారం ఫెమినా మిస్ ఇండియా–తెలంగాణ–2023 ఊర్మిలాచౌహాన్, గ్లెమ్మన్ మిస్‌ఇండియా సెకండ్ రన్నరప్–2023 షషిషావసీమ్‌లు సందడి చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టోర్‌లో రకరకాల ప్రసిద్ధి చెందిన ఐస్‌క్రీమ్‌ల ఆఫర్లను వారు ప్రకటించారు. స్వాతంత్య్ర దినోత్సవాన తక్కువ ధర ఆఫర్లలో ఐస్‌క్రీమ్‌లను అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.



డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరిస్తున్న భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్

గౌలిపురా: డ్రగ్స్ వినియోగానికి నేటి యువత దూరంగా ఉండాలని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ సూచించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్గా హోటల్ ప్రధాన రహదారిలో శనివారం డ్రగ్స్‌పై స్థానిక యువతకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

యువత మాదకద్రవ్యాల బారిన పడి విలువైన తమ జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తూ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్సైలు నరేందర్‌రెడ్డి, అంకిరెడ్డి, లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



ర్యాలీగా బయలుదేరుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా మోసం చేస్తోందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇస్తామని హామీఇచ్చి తొమ్మిదేళ్లు గడుస్తోదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపేద ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, రావుల భాస్కర్, బుచ్చిరెడ్డి, జోగి రవి, టి.చిన్న, కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలందరికీ రూ. లక్ష ఆర్థిక సహాయం అందించాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడదీసి పాలించు అనే సూత్రాన్ని పాటిస్తూ కులాల మధ్య చిచ్చు పెడుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలలోని కొన్ని కులాలకు లక్ష రూపాయల పథకాన్ని బీసీలందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ బొమ్మరాజు నర్సింహ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా వై.శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలందరికీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలన్నారు.

బృందావన్ కాలనీలో మొక్కల పంపిణీ

బండ్లగూడ: హరితహార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలంతా ముందుకు రావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం బృందావన్ కాలనీవినాయక మండపం వద్ద హరితహార కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌పిజి అరుణ, వెంకట్ పాల్గొన్నారు.


బృందావన్ కాలనీలో మొక్కలు అందజేస్తున్న కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్

మేనేజ్‌లో ఘనంగా కాన్వొకేషన్



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న ముఖ్య కార్యదర్శి



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో 7 వ కాన్వొకేషన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలతో పాటు వారికి పథకాలకు అందజేశారు. వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కార్యదర్శి మనోజ్ అహూజా ముఖ్యఅతిథిగా పాల్గొన్ని విద్యార్థులకు పట్టాలతోపాటు బంగారు పథకాలను అందజేశారు. అధికారులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు,పలు సంస్థల ప్రతినిధులు, మేనేజ్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో పాల్గొన్న వి.ప్రకాష్‌రావు తదితరులు.

మణికొండ: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాటర్ రిసోర్స్ చైర్మన్ వి.ప్రకాష్‌రావు సూచించారు. వనితమోహన్ ఆధ్వర్యంలో శనివారం మణికొండలోని ముష్క్ చెరువు వద్ద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 170 మంది వాలంటీర్లు పాల్గొని చెత్త చెదారాలు, వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లుతదితరవాటిని మొత్తం 356కిలోల వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధృవాన్ష్ ఆర్గనైజేషన్ సభ్యులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం


జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నాలెడ్జ్ మెనేజ్‌మెంట్ సెంటర్‌లో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం –2023 ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 131వ జయంతి సందర్భంగా పుష్పంజలి ఘటించారు.యూనివర్సిటీ లైబ్రెరియన్ ఎపీ రవికుమార్ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రంలో చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కొలపురి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ప్రతినిధుల బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థి సమస్యలు, యువత అభివృద్ధి అంశాలపై సమగ్రంగా విద్యార్థి సంఘాలతో మాట్లాడామన్నారు. విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఓబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హెచ్‌సీయూ నాయకుడు వై.శివకుమార్‌ముదిరాజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలలోని సమస్యల పరిష్కారం కావాలంటే ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో విద్యార్థి, నిరుద్యోగ యువత సమస్యలపై స్పష్టమైన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నర్సింహా మాట్లాడుతూ... రాష్ట్రంలోని నిరుద్యోగ, విద్యార్థి, యువత అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తం పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ వంశీనాయక్, హెచ్‌సీయూ బీఎస్ఎఫ్ నాయకులు, రీసర్చ్ స్కాలర్స్ పరశురామ్, రమేష్, ఏటీబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, బొమ్మెన అనిల్‌కుమార్, అరుణ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.